క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంత్రి అంబటి



రాజుపాలెం: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరంపాడు కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దంపతులు గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు మంత్రి అంబటి రాంబాబు, ఇతర నాయకులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయగా స్వామి ప్రసాదాన్ని అందుకున్నారు. ఆయతో పాటు సత్తెనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ తులసి, సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకురాలు డాక్టర్ గీతాహాసంతి పాల్గొన్నారు.

ప్రశాంతతకు యోగా దోహదం



సత్తెనపల్లి: మానసిక, ఆరోగ్య ప్రశాంతతకు యోగ ఎంతో దోహదపడుతుంది అని సత్యాధ్యానమందిర వ్యవస్థాపక అధ్యక్షుడు గణపవరపు రంగారావు అన్నారు. అంతర్జాతీయ యోగా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నాగార్జున నగర్‌లోని సత్యాధ్యానమందిరం ఆవరణలో గురువారం నిర్వహించిన యోగ ప్రోత్సాహక సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు యోగా గురుజి రోజా రాణి సుభాష్ చంద్ర వ్యవహరించారు. రంగారావు మాట్లాడుతూ మనసును శరీరాన్ని ఏకం చేసేది యోగానేనన్నారు. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగ మీద అధికంగా చొరవ చూపాలని కోరారు. ప్రతి మనిషికి యోగా అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా కొత్తగా ఆసక్తితో చేరిన 25 మంది యోగ అభ్యాసకులకు గణపరపు రంగారావు, పార్వతి దేవి సంయుక్తంగా ప్రోత్సాహక సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రస్తుత పరిస్థితులలో మహిళలకు యోగ ఎంతో అవసరమన్నారు యోగ అభ్యాసకులు అందరూ కలిసి సత్యాధ్యానమందిరం నిర్వహణ ఖర్చుల నిమిత్తం యోగా గురూజీ రోజా రాణి రూ.10 వేలు విరాళాన్ని కొమార వెంకట రమణ నాగరాజుకు అందజేశారు. సభలో సత్యాధ్యానమందిరం మాజీ అధ్యక్షులు ఉన్నవ పూర్ణచంద్ర ప్రసాదరావు, పీసపాటి హనుమంతరావు, ఉపాధ్యాయురాలు శాస్త్రి పాల్గొన్నారు.

విత్తనాల షాపులపై విజిలెన్స్ దాడులు



క్రోసూరు: క్రోసూరు లోని విత్తనాల షాపులను విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేసినట్లు ఏఓ వేణుగోపాల్ గురువారం తెలిపారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో అచ్చంపేట, క్రోసూరు విత్తనాల షాపులను తనిఖీ చేసినట్లు తెలిపారు. అచ్చంపేటలోని శ్రీమణికంఠ సీడ్స్, క్రోసూరులోని శివసాయి సీడ్స్, లక్ష్మీనరసింహా ఎంటర్‌ప్రైజెస్ షాపులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు ఏఓ చెప్పారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న పత్తి విత్తనాలు 242.725 కిలోలు రూ.4,35,883 విలువ చేసేవి సీజ్ చేసినట్లు చెప్పారు. దీంతో పాటు 267.900 కిలోల పత్తి విత్తనాలు అమ్మకాలు నిలిపివేసినట్లు వివరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్సుమెంట్ వ్యవసాయధికారి వాసంతి, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ సీఐ పీవీ ఆంజినేయులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రజక కాలనీకి చెందిన చొప్పవరపు కుమారి(40) అల్లుడు శివ నాగరాజు ద్విచక్ర వాహనంపై రాజుపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోకి రాగానే రోడ్డు మార్జిన్ దిగడంతో వాహనం అదుపు తప్పి కింద పడింది. ఇదే సమయంలో పిడుగురాళ్ల వైపు నుంచి కొండమోడు వైపు వెళ్తున్న లారీ వెనుక టైరు కుమారి తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న నాగరాజుకు స్వల్పంగా గాయపడ్డాడు. లారీ ఆపకుండా వెళ్లి పోయిందని, సీసీ ఫుటేజ్ ఆధారంగా లారీని గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ



సత్తెనపల్లిలో సందేశమిస్తున్న ప్రభుత్వ ఖాజి బాజి



హాజరైన ముస్లింలు

విజయపురిసౌత్: బక్రీద్ భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. స్థానిక ఈద్గాలో ముస్లింలు నమాజ్ చేశారు. మత గురువు(హాఫీజ్‌సాబ్) ఇమామ్ అబ్దుల్ గఫూర్ సందేశం అందించారు. కార్యక్రమంలో స్థానిక మసీదు అధ్యక్షుడు షేక్ అబ్దుల్ గని, ఈద్గా అధ్యక్షుడు ఎస్‌డీ రహంతుల్లా, మౌజన్ ఎస్‌కే ఖాసీం, కోశాధికారి ఎస్‌కే మస్తాన్‌వలి, షేక్ మస్తాన్, ఏ నబీఖాన్, ఎస్‌కే మహమ్మద్‌బాషా, ఏఎస్ఐ ఎస్‌కే మస్తాన్‌వలి పాల్గొన్నారు.

గురజాల: త్యాగానికి ప్రతీక బక్రీదును నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు నిరుపేదలకు దానధర్మాలు చేశారు.

దాచేపల్లిలో..

దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలోని ఈద్గాలో జరిగిన నమాజ్ కార్యక్రమంలో వందల సంఖ్యలో ముస్లింలు తరలించారు. మత పెద్దలు నమాజ్ చేశారు. బక్రీద్ విశిష్టతను వివరించారు. ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలని సూచించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

రెంటచింతల: తుమ్మకోట గ్రామంలో నున్న ఈద్గా, రెంటచింతలలోని యర్రబాలెం ఆంజనేయస్వామి మాన్యం, రైల్‌పేట మసీదు, మిట్టగుడిపాడు, మల్లవరం, పశర్లపాడు పాలువాయి, రెంటాల, మంచికల్లు గ్రామాలలోని ముస్లింలు బక్రీద్ ప్రత్యేక నమాజ్ నిర్వహించారు.

మాచర్ల: పట్టణంలోని ముస్లింలు బక్రీద్ పండుగను గురువారం ఎంతో పవిత్రంగా జరుపుకున్నారు. పెద్దలకు ముందు రోజు ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించి వేలాదిమంది పట్టణంలోని 11 మసీదులలో ప్రార్థనలు చేశారు. అనంతరం భారీ స్థాయిలో ముస్లిం పెద్దలతో పాటు ముస్లింలంతా బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఈద్గా జరుపుకున్నారు. ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ప్రభుత్వ ఖాజి బాజి సందేశాన్ని అందించారు.

పిడుగురాళ్ల లో..

పిడుగురాళ్ల: ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకున్నారు. పట్టణంలో అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్‌మేస్త్రీ ఆధ్వర్యంలో జానపాడు రోడ్డులోని ఈద్గాలో నమాజు చేశారు. ఎండీ ఉస్మాన్ మేస్త్రీ మాట్లాడుతూ.. ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, పట్టణ అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలి, ఖిద్మత్ టౌన్ సోషల్ కమిటీ అధ్యక్షులు ఎండీ బాబర్ పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో బక్రీద్ వేడుకల్లో సందేశమిస్తున్న అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్

మాచవరంలో..

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్‌ను ముస్లిం జరుపుకున్నారు. ఆయా ఈద్గాల వద్ద నమాజ్ చేశారు.

వైభవంగా దత్తాత్రేయ రంగనాథ స్వామి ఉత్సవాలు



వేడుకల్లో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు

మాచర్ల రూరల్: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని దత్తాత్రేయ, రంగనాథ స్వామి ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు కురుమేటి దత్తాత్రేయ శర్మ, సుదర్శనాచార్యులు నేతృత్వంలో ప్రత్యేక అలంకరణ నిర్వహించి పూజలు చేశారు. ఆలయానికి వేకువజామునే వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామికి పొంగళ్లు వండి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ సాంబయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు. మాచర్ల పట్టణానికి చెందిన రంగదత్త అన్నదాన సమారాధన సేవా పాలక వర్గం అధ్యక్షులు పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు, చుండూరు నరసింహారావు, శేరిరెడ్డి వీరారెడ్డి నేతృత్వంలో భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రూరల్ సీఐ షేక్ షమీముల్లా నేతృత్వంలో ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

పట్టుదలకు ప్రతీక ఏకలవ్యుడు



ఏకలవ్యుడి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

చిలకలూరిపేట: కృషి, పట్టుదలకు ప్రతీక ఏకలవ్యుడని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి శ్రీనునాయక్ చెప్పారు. సంఘ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు విద్యను నేర్పేందుకు నిరాకరించినా పట్టుదల, స్వయం కృషితో విలువిద్య నేర్చుకున్న వీరుడని కొనియాడారు. విద్య నేర్పనప్పటికీ ద్రోణాచార్యుడు అడిగిందే తడవుగా బొటన వేలును త్యాగం చేసిన మహావీరుడని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు బి చిన్నా నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, రాంబాబునాయక్ పాల్గొన్నారు.

తొగట వీర క్షత్రియులలో చైతన్యం రావాలి



చౌడేశ్వరి దేవస్థానంలో ఎం.వీరాంజనేయ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి

రెంటచింతల: రాష్ట్రంలోని తొగట వీర క్షత్రియ సంఘాన్ని సమిష్టిగా బలోపేతం చేయడానికి క్షత్రియులలో చైతన్యం తీసుకురావాలని తొగట వీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ అన్నారు. గురువారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రెంటచింతల మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని ఆయన ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సంఘం నాయకులతో కలసి సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం సమీపంలో నున్న తొగట వీర క్షత్రియ అన్నదానం సత్రాన్ని పరిశీలించారు. తొలుత రెంటచింతలలోని బాలవికాస్ స్కూల్ సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. విద్య, ఆర్థిక, రాజకీయ తదితర రంగాలలో తొగట వీర క్షత్రియులు రాణించాలన్నారు. వెనుకబడిన వారిని ఆదుకునేందుకు సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి వీరాంజనేయ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు చూపూరి బాలయ్య, గుంటూరు జిల్లా అధ్యక్షులు అనంత మల్లికార్జునరావు, దేవస్థానం పెద్ద శెట్టి పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పన్ను వసూలు అంతంతమాత్రమే..

నేటి వరకే గడువు !

- మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లింపునకు ఆఖరు
- జూలై ఒకటి నుంచి చెల్లించే వారిపై 2 శాతం వడ్డీ భారం
- సత్తెనపల్లి మున్సిపాల్టీ పరిధిలో 15 వేలకు పైగా అసెస్మెంట్లు
- మొత్తం డిమాండ్ ఇప్పటి వరకు వసూలైంది రూ.1.60 కోట్లు మాత్రమే



సత్తెనపల్లి పట్టణంలోని భవనాలు

సత్తెనపల్లి: పురపాలక సంఘానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా ... ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నా ... వివిధ రూపాల్లో ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్దుల కింద నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానా నింపుకోవాల్సిందే. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలుపై దృష్టి సారించిన మున్సిపల్ శాఖ మొదటి అర్ధ సంవత్సరం పన్ను మొత్తాన్ని రాబట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండు విడతల్లో భవన యజమానులు పన్ను చెల్లించాల్సి ఉండగా... మొదటి అర్ధ సంవత్సరం గడువు ఈనెల 30తో ముగియనుంది. అయితే ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కాలేదు.

15,527 అసెస్మెంట్లు ..

పురపాలక సంఘ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 15,527 అసెస్మెంట్లు ఉన్నాయి. వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూ.4.59 కోట్లు వసూలు కావాల్సి ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో మరో రూ.1.04 కోట్లు బకాయిలున్నాయి. మొత్తంగా రూ.5.63 కోట్లు ఖజానాకు జమ కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.1.60 కోట్లు(28.42 శాతం) మాత్రమే వసూలైనట్లు అధికారిక లెక్కలు వెల్లడి స్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో మొత్తం పన్ను ఒకే సారి చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. ఇంకా రూ.4.03 కోట్లు ఆస్తి పన్ను రూపంలో రావాల్సి ఉంది.

ముగియనున్న గడువు ...

2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించేందుకు గడువు దగ్గరపడుతోంది. జూన్ 30లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పన్ను చెల్లించవచ్చని పురపాలక యంత్రాంగం ప్రకటించింది. జూలై ఒకటో తేదీ నుంచి పన్ను చెల్లించేవారు 2 శాతం వడ్డీతో పన్ను మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు దగ్గర పడుతుండడంతో మున్సిపల్ యంత్రాంగం పట్టణంలోని భవన యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించటం ద్వారా వడ్డీ భారం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



పన్ను చెల్లించేందుకు జూన్ 30 వరకు ఎటువంటి అపరాధ రుసుం ఉండదు. అనంతరం పన్ను చెల్లించే వారిపై మొదటి అర్ధ సంవత్సరం డిమాండ్‌పై 2 శాతం వడ్డీ పడుతుంది. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలి. వడ్డీ భారం నుంచి విముక్తి పొందవచ్చు.

–కొలిమి షమ్మి,
మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

మాచర్ల: ఇటీవల కారెంపూడి ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఉన్న వేపకంపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు బొల్నేడి అమర్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడు మాచర్లకు చెందిన సయ్యద్ అన్వర్‌ను గురువారం అరెస్టు చేసినట్లు కారెంపూడి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అరెస్టు చేసిన అన్వర్‌ను మాచర్ల ఇన్‌చార్జి మేజిస్ట్రేటు ఎదుట గురువారం రాత్రి హాజరు పరచగా నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు. ఇదిలా ఉంటే అన్వర్‌ను కిడ్నాప్ చేశారని టీడీపీ సోషల్ మీడియాలో విస్తృతంగా జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఈ అరెస్టుతో తేలిపోయింది.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

సత్తెనపల్లి: రోటరీ క్లబ్ సత్తెనపల్లి సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరికీ ఆదర్శనీయంగా ఉంటుందని పట్టణ ఎస్ఐ ఏ రఘుపతిరావు అన్నారు. వివిధ పాఠశాలలో చదువుతున్న 21 మంది పేద విద్యార్థులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ రోటరీ క్లబ్ అందించిన సహకారంతో విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. రోటరీ క్లబ్ సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ మాట్లాడుతూ బాలికలు పాఠశాలలకు వెళ్లడానికి సైకిళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పాయసం మహేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్ బాపతు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



సత్రశాలలో పూజలు అందుకుంటున్న మల్లికార్జునస్వామి

దాచేపల్లి: తొలి ఏకాదశి పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామ సమీపంలోని కొండపై కొలువైన సారంగధరేశ్వరస్వామి దేవాలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారికి పూజలు నిర్వహించారు. దాచేపల్లి, నడికుడితో పాటు పలు గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా పూజలు చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

గురజాల: తొలి ఏకాదశి వేడుకలు శైవక్షేత్రాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దైదలో అమరలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు స్వామిని దర్శించుకునేందుకు వేకువజామునుంచే బారులుతీరారు. బిలంలో కొలువైవున్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని ముక్కంటేశ్వర స్వామి, గంగా పార్వతి సమేత ఇష్టకామేశ్వరస్వామి దేవాలయం, అమరలింగేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిటకిటలాడిన వైష్ణవ దేవాలయాలు

మాచర్ల: తొలి ఏకాదశి పురస్కరించుకొని గురువారం పట్టణంలోని వైష్ణవ దేవాలయాలలో తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో ఈఓ సాంబయ్య, ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామికి దీపాలు వెలిగించారు. పాత మాచర్లలోని వెంకటేశ్వర స్వామి వారికి ఆలయ కమిటీ సభ్యులు ఉప్పుతోళ్ళ గోవిందరాజులు, జూలకంటి వీరారెడ్డి, శ్రీనివాసశర్మ, కామనబోయిన కోటయ్య, కొమెర శ్రీను, ఒరుగంటి చెన్నకేశవరావు, తదితరుల ఆధ్వర్యంలో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నెహ్రూ నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు.

రెంటచింతల: ప్రముఖ శైవక్షేత్రమైన సత్రశాలలోని గంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పవిత్ర కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని తులసికోట, ధ్వజస్తంభం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. మంచికల్లు గ్రామ శివార్లో వేంచేసిన శ్రీ తిరుమల నాథ వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సం చేపట్టారు. సత్రశాల దేవస్థానం వద్ద భక్తులకు దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి ప్రసాదం పంపిణీ చేశారు. మొత్తం రూ. 27,890 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం చైర్మన్ బొద్దూరి బ్రహ్మరెడ్డి తెలిపారు.

మాచవరంలో..

మాచవరం: మండలంలోని మాచవరం తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయా దేవాలయాల హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు దేవాయాలు తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో శివాలయం, నాగులు దేవాలయం వంటి దేవాయలాలు భక్తులకు కిక్కిరిసిపోగా, కొంత మంది రైతులు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలంలో పనులు చేసి, దేవునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా భక్తులు వివిధ దేవాలయాలను దర్శించుకొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రహస్యాలకు నిలయం గుత్తికొండ బిలం

జేసీ శ్యాంప్రసాద్



గుత్తికొండ బిలాన్ని దర్శించుకున్న జేసీ ఎ.శ్యాం ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు జంగా

పిడుగురాళ్ల రూరల్: రహస్యాలకు నిలయం గుత్తికొండ బిలమని, దక్షణ కాశీగా పిలవబడే ఈ గుత్తికొండ బలాన్ని దర్శించుకోవటం అదృష్టమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ అన్నారు. తొలిఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని గుత్తికొండ బిలాన్ని గురువారం సందర్శించారు. చీకటి మల్లయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వరంగ మార్గంలో కోనేరులను ఆయన దర్శించారు. ఆయన మాట్లాడుతూ గుత్తికొండ బిలం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందినట్లు చెప్పారు. దీనికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఈ బిలంలో 101 సొరంగ మార్గాలు ఉన్నాయని, ఈ సొరంగ మార్గంలో కాశీకి వెళ్లవచ్చునని పెద్దలు చెబుతుంటారని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జాయింట్ కలెక్టర్ కుటుంబ సభ్యులను సత్కరించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, తహసీల్దార్ చక్రవర్తి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు వీర భద్రునిరామిరెడ్డి, నల్లబోలు రామారావు, సింహ ద్వారా నిర్మాణ దాతలు కుంభా తిరపతయ్య, ఆలయ చైర్మన్ బండ్ల సైదులు, బండ్ల శ్రీనివాసరావు, రామారావు, రామాంజనేయులు, గణేష్, శివ, శివకృష్ణ, కుంభా అచ్చయ్య, వాలునాయక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ



లగడపాడులో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

పెదకూరపాడు: సమస్యలు పరిష్కారించాలని కోరుతూ లగడపాడు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అర్జీలు అందజేశారు. గురువారం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఎస్సీ కులానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1996–97 సంవత్సరంలో భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నంబర్ 28–2ఎ2ఎ, 28–2బి 1 లో 80 ఎకరాలు భూమి ఇచ్చారు. మా అప్పు మొత్తం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తీర్చాం. కానీ 22ఎ లిస్ట్ ఉన్నాయని, వాటిని తొలగించాలని విన్నవించారు. గ్రామంలోని శ్మశానానికి వెళ్లే రహదారి ఆక్రమణలకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వికలాంగుడైనా సాంకేతిక పరమైన సమస్యలతో పింఛన్ అందడం లేదని, గురుకుల పాఠశాలలో మా పిల్లలకు సీట్లు ఇప్పించాలని, పొలంలో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, పట్టాదారుపాస్ పుస్తకాల్లో పేర్లు తప్పుగా నమోదు అయ్యాయని, బీమా పథకం రాలేదని, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నానని ఇలా గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అర్జీలు అందించారు. అంతకు ముందు మీడియాతో మాట్లాడారు.

అమ్మ ఒడిని సక్రమంగా వినియోగించుకోండి..

ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా చదువుకునే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో అమ్మ ఒడి కింద రూ.13 వేలు జమ చేస్తుందన్నారు. అమ్మ ఒడి పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అమ్మ ఒడి పొందిన లబ్ధిదారులు ముందుకు వస్తే వారు ఇచ్చే కొంత మేర నగదుతో విద్యార్థులను విజ్ఞానం పెంపొందించే విధంగా విహార యాత్రలకు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.

రక్తహీనతపై యుద్ధం చేద్దాం.....

పల్నాడు జిల్లాలో 11 సంవత్సరాలు నుంచి 18 సవత్సరాలు లోపు బాలికలలో 82 శాతం రక్త హీనత ఉందని దీనిని నివారించేందుకు తల్లిదండ్రులు బాలికలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ అన్నారు. లగడపాడు గ్రామంలోనే 179 మంది బాలికలు ఉంటే వారిలో 120 మంది రక్తహీనత కలిగిన బాలికలు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ అంటే మీ ఇంటి డాక్టరే...

ప్రభుత్వం ప్రతి ఇంటికి వచ్చి వైద్యసేవలు అందిస్తుందని ఫ్యామిలీ డాక్టర్ అంటే మీ ఇంటి డాక్టరే అని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. ప్రతి నెల రెండు సార్లు ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాం నిర్వహిస్తారని కార్యక్రమం వినియోగించుకోవాలన్నారు. డాక్టర్‌కు గ్రామంలోని ప్రతి ఒక్కరు తెలిసి ఉండేలా సేవలు అందించాలన్నారు.

కలెక్టర్ పర్యటన రద్దు

కారెంపూడి: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం కారెంపూడి పర్యటన రద్దు అయిందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి.శ్రీనివాస్ గురువారం సాయంత్రం తెలిపారు. కారెంపూడికి చెందిన ప్రకృతి ప్రేమికుడు కొమెర అంకారావు(జాజి) తలపెట్టిన కోటి విత్తన బంతులు చల్లాలనే సంకల్పంలో భాగంగా నల్లమల అడవిలో విత్తన బంతులు (సీడ్ బాల్స్) చల్లేందుకు కలెక్టర్ కారెంపూడి రావాల్సి ఉందని, అనివార్య కారణాల వలన కలెక్టర్ పర్యటన రద్దు అయినట్లు అధికారులు తెలిపారు. తర్వాత కలెక్టర్ పర్యటన తేదీ ప్రకటిస్తారని పేర్కొన్నారు.